## క్లుప్తంగా

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేశ్, తిప్పారపు శ్రీనివాస్, కొలిపాక సుజాత, పెద్దెల్లి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

### పట్టాలు మంజూరు చేయాలని వినతి

రామగుండం: ఎన్టీపీసీ ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న నిరుపేద ఇళ్లకు పట్టాలు, పక్కా ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఎం ప్రతినిధులు కోరారు. శుక్రవారం రామగుండం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని తహసీల్దార్‌ను కోరారు. సీపీఎం జిల్లా ప్రతినిధులు భిక్షపతి, ఎం.రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, పి.నాగలక్ష్మి, ముత్తునూరి సంపత్, కడార్ల శ్రీనివాస్, మార్త సంపత్, నర్సింహాచారి, రాంబాబు, శివ ఉన్నారు.

### మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం కూడలిలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తెలిపినందుకు సంబరాలు నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంచి బాణసంచా కాల్చారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మడిపల్లి దశరథం, కన్వీనర్ గుడిసెల దుర్గయ్య, అంబేడ్కర్ సంఘం మండల ప్రతినిధి ఇండిబిల్లి రవీందర్, జూల రాజేశ్, జూల లింగయ్య, రవి, రామకృష్ణ ఉన్నారు.

### బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి

జ్యోతినగర్: బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అమాయక గిరిజనులు, ప్రజలను, ఆదివాసులను ఎన్‌కౌంటర్ చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని కోరారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయడంతో పాటు బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న, రామన్న, చంద్రన్న, వైకుంఠం, శంకర్, నర్సయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### భగవద్గీత పారాయణం విజయవంతం చేయండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సమితి నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో మంథని కేంద్రంలో 23న 5వేల మంది భక్తులతో నిర్వహించనున్న భగవద్గీత పారాయణం విజయవంతం చేయాలని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంథెన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. యైటింక్లయిన్ కాలనీ బీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొని భగవద్గీత పారాయణానికి సంబంధించిన కరపత్రాలను సమితి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సనాతన ధర్మం కాపాడడానికి ఇంటింటికీ భగవద్గీత కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. 23న మంథని పట్టణ కేంద్రంలో 5వేల మంది భక్తులతో నిర్వహించనున్న గీతాలాపనలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విక్రమ్ సింహారావు, కృష్ణమూర్తి, అశోక్‌కుమార్, బాలయ్య, రాజమౌళి, మూకిరి రాజు, శశికుమార్, కుమార్‌గౌడ్, శ్రీనివాస్, అనిల్‌కుమార్, సుమంత్ పాల్గొన్నారు.



రామగుండం: ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో..



సుల్తానాబాద్: పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



జ్యోతినగర్: ఎన్టీపీసీ టీటీఎస్ జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



కమాన్‌పూర్: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



గోదావరిఖనిటౌన్: పరీక్ష కేంద్రం వద్ద ఏసీపీ, సీఐలు



కాల్వశ్రీరాంపూర్: తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు



రామగిరి: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



యైటింక్లయిన్‌కాలనీ: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు



జూలపల్లి: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

# ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

జిల్లావ్యాప్తంగా మొదటిరోజు ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఇన్విజిలేటర్లు గేటు బయట విద్యార్థులను తనిఖీ చేశారు. పరీక్ష రాసేందుకు తమకు కేటాయించిన తరగతి గదులను విద్యార్థులు నోటీస్ బోర్డులో చూసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ డి.వేణు, ఆర్డీవో, తహసీల్దార్లు, ఎంఈవోలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

- సాక్షి నెట్‌వర్క్

## రోడ్డు పనుల్లో వేగం పెంచాలి

జూలపల్లి: ట్రాక్టర్ కేజ్‌వీల్స్ రోడ్లపైకి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామ రైతులు, ప్రజలపై ఉందని డీఆర్‌డీవో కాళిందిని సూచించారు. మండలంలోని పెద్దాపూర్‌లో ఉపాధిహామీలో భాగంగా చేపట్టిన మట్టిరోడ్డు నిర్మాణం, నర్సరీ, జూలపల్లిలో ఇందిరమ్మ మోడల్ ఇల్లును శుక్రవారం ఆమె పరిశీలించారు. వేసవిదృష్ట్యా నర్సరీల్లోని మొక్కలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పని స్థలం వద్ద కూలీలకు హెల్త్ ఇన్సూరెన్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఉపాధి కూలీ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. రోడ్డు పనుల్లో వేగం పెంచాలని, కూలీలకు పని స్థలాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీవో పద్మజ, ఏపీవో సదానందం, టీఏ శ్రీకర్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కాళిందిని

## వలస వ్యాపారుల మోసాలపై రౌండ్‌టేబుల్ సమావేశం

పెద్దపల్లిరూరల్: వ్యాపారం పేరిట పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు నాసిరకమైన సరుకులు విక్రయిస్తూ అధిక ధరలు వసూలు చేసుకుంటున్నారని మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ ఆరోపించారు. పెద్దపల్లిలో శుక్రవారం వలసవ్యాపారుల మోసాలపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. దేశంలోని ఏప్రాంతంలో అయినా వ్యాపారం చేసుకునే స్వేచ్ఛ భారత పౌరులకు ఉందన్నారు. అయితే ఆ వ్యాపారం చట్టవిరుద్ధంగా నిర్వహించడం సరికాదన్నారు. నాణ్యతలేని, నాసిరకమైన సరుకులు విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని ప్లంబర్, ఎలక్ట్రికల్ తదితర పనులు చేసే కార్మికులు వాపోయారు. వలస వ్యాపారుల దుకాణాల్లో స్థానికులెవరికీ ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. నాణ్యతలేని సరుకులు తెచ్చి ఇక్కడి ప్రజలకు అమ్ముతున్నారన్నారు. ఏప్రిల్ 13న మళ్లీ సమావేశం నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. నాయకులు పర్వతాలు, రాజగోపాల్, భాస్కర్, వినయ్, రామ్మూర్తి, రవి, సుధాకర్, జమీల్, సయ్యద్, తబ్రేజ్, రమేశ్, విజయ్ పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదాం

జ్యోతినగర్: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదామని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు అర్మూర్ల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు కె.ధర్మేందర్ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 23 నుంచి 30 వరకు జిల్లావ్యాప్తంగా వర్ధంతి సభలు జరపాలని తీర్మానించినట్లు తెలిపారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చిలుక శంకర్, మేరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేశ్, పైడిపల్లి రమేశ్, ఆర్.రాయమల్లు, గుండు రాజయ్య, కె.మహేందర్, ఈదునూరి బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

## ప్రతీ ఒక్కరు ధ్యానం చేయాలి

సుల్తానాబాద్: ప్రతీ ఒక్కరు ధ్యానం చేయాలని, ధ్యానంతో ఏకాగ్రత, ప్రశాంతత చేకూరుతుందని, దీంతో మనిషి ఆరోగ్యంగా ఉంటారని కాంతిజగత్ వ్యవస్థాపకుడు ఆస్ట్రల్ శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో విశ్వకాంతి టీం ఆధ్వర్యంలో శుక్రవారం ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం ద్వారా మనిషిలోని కోపతాపాలు తగ్గడంతో ప్రేమలు పెరుగుతాయన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. సుల్తానాబాద్‌కు చెందిన వొల్లాల మంజుల, అంజయ్య, ఎన్టీపీసీకి చెందిన పద్మజ, లక్ష్మీచంద్ర, రత్నమాల, విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, ముఖ్య సలహాదారు పల్లకిషన్, మార్కెట్ డైరెక్టర్ పల్ల శ్రీనివాస్ (వాసు), పట్టణ మహిళా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు బాదం వాణి పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వాసవీ వనిత క్లబ్ సభ్యులు

## సంక్షిప్త వార్తలు

• ఇసుక ట్రాక్టరు పట్టివేత

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై గోపతి నరేశ్ తెలిపారు. ఖమ్మంపల్లి పంచాయతీలోని సందరెల్లికి చెందిన పెద్ది లక్ష్మీరాజయ్య అనే వ్యక్తి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

• ఐఎన్‌టీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురేశ్

యైటింక్లయిన్‌కాలనీ: ఐఎన్‌టీయూసీ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాలనీకి చెందిన మేకల సురేశ్‌తోపాటు జిల్లా సెక్రటరీగా సల్మాన్‌ను నియమిస్తున్నట్లు ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జనక్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి దాసు నియామక పత్రం అందజేశారు.

• అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సుల్తానాబాద్: కార్మికుల అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్మిక సంఘాల కార్మికులను శుక్రవారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దారుణమన్నారు. ముందస్తు అరెస్టుల పేరుతో సుల్తానాబాద్ మున్సిపల్ కార్మికులను అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసు ఉన్నతాధికారులపై ఉందన్నారు.

## కార్మికుల ముందస్తు అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో కార్మిక సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: హమాలీ, భవన నిర్మాణం, ఆటో, బీడీ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. ఛలో హైదరాబాద్‌కు సంబంధం లేని వివిధ రంగాలకు చెందిన కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారని ఆరోపించారు. రానున్న కాలంలో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవాలన్నారు. నాయకులు రవీందర్, ఖాజా ఉన్నారు.

## మారుపేర్ల బాధితుల పక్షాన ఎమ్మెల్యే గళం విప్పాలి

గోదావరిఖని: మారుపేర్ల బాధితుల పక్షాన రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ గళం విప్పాలని బాధితులు వంగ సంతోష్, దరుగుల కొమురమ్మ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విజిలెన్స్ సమస్య కారణంగా మారుపేర్ల బాధితుల బతుకులు రోడ్డుమీద పడ్డాయని వాపోయారు. ఇటీవల సింగరేణి యాజమాన్యంతో జరిపిన స్ట్రక్చర్ మీటింగ్‌లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు మారుపేర్ల సమస్య పరిష్కారం కోసం మాట్లాడారన్నారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం చొరవ చూపి తొందరగా పరిష్కారం చేయాలని కోరారు. సమావేశంలో మారుపేర్ల విజిలెన్స్ బాధితులు ఈర్ల రాజయ్య, లక్కాకుల శ్రావణ్, సత్యం, తిరుమల శ్రీనివాస్, ఆవుల రవి పాల్గొన్నారు.


## ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

పెద్దపల్లిరూరల్: ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించే ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించడంతో పాటు పింఛన్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని మాతాశిశు ఆసుపత్రి ఎదుట ఆశావర్కర్లతో కలిసి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా పనిచేస్తున్న ఆశావర్కర్లకు కనీసవేతనాలు అందించాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో ఈ పథకం అమలుకు నిధులు పెంచాలన్నారు. నాయకులు లత, రేణుక, స్వప్న, మమత, మాలతి, వెంకటేశ్వరి, సునీత, రాజేశ్వరి ఉన్నారు.

## పరీక్షలు ప్రశాంతంగా రాయాలి



సూచనలు చేస్తున్న ఎడ్యుకేషనల్ సెక్రటరీ

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్ శుక్రవారం కొత్తగూడెం నుంచి వచ్చి విద్యార్థులను కలిసి పలు సూచనలు చేశారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ అనిల్‌కుమార్, హెచ్ఎం సుందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువ పార్లమెంట్ ద్వారా నాయకత్వ లక్షణాలు



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖనిటౌన్: యువ పార్లమెంట్ కార్యక్రమంతో నేటి యువతలో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని సింగరేణి ఆర్జీ–1 జీఎం డి.లలిత్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వికసిత్ భారత్ యువ పార్లమెంట్ ప్రారంభ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత దేశంలో కొత్త నాయకత్వానికి నాంది పలకాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన యువ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించుకునే అవకాశం కల్పించినందుకు శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్, నెహ్రూ యువ కేంద్రండిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ మద్దుల వెంకట రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నోడల్ అధికారి సాంబశివరావు మాట్లాడుతూ న్యాయ నిర్ణేతలు వివిధ అంశాలను పరిశీలించి మొత్తం 100 మార్కులకు పాయింట్లు వేస్తారని తెలిపారు. కళాశాల స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ జి.సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎం.నరేశ్, డి.కిరణ్మయి, శారద, తిరుపతి, పి.శంకరయ్య, పి.శ్రీదేవి, ఉషారాణి, సురేశ్, ప్రవంతి, సమత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ స్టూడెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడిపించాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి

రామగుండం: రామగుండం పారిశ్రామిక ప్రాంత అభివృద్ధిని గుర్తించి ప్రధాని మోదీ అమృత్ భారత్ పథకంలో రామగుండం రైల్వేస్టేషన్‌కు గుర్తింపు కల్పించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కోరారు. శుక్రవారం రామగుండం రైల్వేస్టేషన్ సందర్శనకు వచ్చిన ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. పారిశ్రామిక ప్రాంతంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు నివసిస్తుండడంతో వారి రాష్ట్రంలో ప్రత్యేక దినాలు, వేడుకలను గుర్తించి ప్రత్యేక రైళ్లు నడిపించాలన్నారు. సామాజిక కార్యకర్త మద్దెల దినేశ్ శ్రీరామనవమి, శబరిమలై, తిరుపతికి వేడుకల సమయంలో రామగుండం కేంద్రంగా ప్రత్యేక రైళ్లు నడిపించాలని వినతిపత్రం అందజేశారు.

**రైల్వే ఉద్యోగుల సంక్షేమంపై దృష్టిసారించాలి**

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌ను కోట్లాది నిధులతో అభివృద్ధి చేయడంపై తొలుత రైల్వే ప్రజా సంబంధాల సభ్యుడు (డీఆర్‌యూసీసీ) అనుమాస శ్రీనివాస్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం జీఎం రామగుండం రైల్వేస్టేషన్ సందర్శించగా పలు అంశాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల డిమాండ్లు, కనీస వసతుల కల్పనపై దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు ఓవై.స్వామి, వీరన్న, మోజెస్, రాథోడ్ ఆనంద్, రామారావు, గణేశ్ సింగ్, మోహన్‌రావు, ఉమా మహేశ్, సాంబశివుడు, సతీశ్ జీఎంకు వినతిపత్రం అందజేశారు.

**జీఎంకు వినతి**

ఓదెల: మండలంలోని పొత్కపల్లి రైల్వేస్టేషన్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కరీంనగర్‌లో శుక్రవారం జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అంబాల కొమురయ్య వినతిపత్రం అందజేశారు.

## రాజకీయ ఉనికి కోసమే పాదయాత్ర



పోస్టు ద్వారా కేసీఆర్‌కు నివేదిక పంపిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

గోదావరిఖని: కేవలం తమ రాజకీయ ఉనికి కోసం చేస్తున్న పాదయాత్రను ప్రజలు నమ్మరని ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌రాజ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పోస్టు ద్వారా మాజీ సీఎం కేసీఆర్‌కు నివేదిక పంపించారు. గోదావరి గోస పేరుతో చేస్తున్న యాత్ర చూస్తుంటే వంద ఎలుకలు తిన్న పిల్లి కాశీ యాత్రకు బయల్దేరినట్టు ఉందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం అసమర్థపాలనలో నాణ్యతాలోపంతో బ్యారేజీలు నిర్మించడం మూలంగానే ప్రాజెక్టులు ఎండిపోయాయని ఆరోపించారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవడం మూలంగానే నీళ్లు లేకుండా పోయాయన్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదికలో నిర్మాణ సమయంలో నాణ్యతా లోపంతోనే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని విమర్శించారు. బ్యారేజీ కుంగడంతో బ్యాక్‌వాటర్ పంపింగ్ లేక బ్యారేజీలు ఎండిపోయాయన్నారు. చిత్తశుద్ధి ఉంటే శాస్త్రీయపరమైన చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. సమావేశంలో నాయకులు కొటం సతీశ్, నజీముద్దీన్, బైరిమల్ల రాజ్‌కుమార్, చొప్పరి శ్రీనివాస్, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో మంథనికి మొండిచేయి



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: రాష్ట్ర బడ్జెట్‌లో మంథనికి మొండి చేయి చూపించారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మంథనిలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని నియోజకవర్గానికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించకపోగా ఈప్రాంత ప్రజలకు మంత్రిగా చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం ఇప్పిస్తామని మాట ఇచ్చారని, కానీ బడ్జెట్‌లో మాత్రం కేటాయింపులు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా బీద ప్రజల అభ్యున్నతి కోసం ప్రజల పక్షానే ఉంటూ పోరాటం చేస్తామన్నారు. అనంతరం 23న కరీంనగర్‌లో నిర్వహించే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సమావేశంపై నియోజకవర్గంలోని అన్ని మండల నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

## హద్దురాళ్లు తొలగించిన ఐదుగురిపై కేసు

గోదావరిఖని: స్థానిక మార్కండేయకాలనీలోని పట్టాభూమిలో హద్దురాళ్లు తొలగించిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. బాధితుడు నజీముద్దీన్ ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, రాము, పాన్‌షాప్ శ్రీనివాస్, రాజు, సంతోష్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

**నలుగురిపై కేసు నమోదు..**

స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన బాపుపై దాడిచేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. ద్విచక్రవాహనం నుంచి పెట్రోల్ తీస్తున్నారని తిడుతుండగా, తమనే అంటున్నారని భావించిన సాకేత్, వంశీ, నెహాన్, బన్నీ బాపుపై దాడి చేశారు. కాగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 25న రామాలయం ద్వితీయ వార్షికోత్సవం



కరపత్రం ఆవిష్కరిస్తున్న కమిటీ పెద్దలు

ముత్తారం: మండలంలోని లక్కారంలో 25న జరగనున్న రామాలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి, ఆలయ కమిటీ పెద్దలు కోరారు. ఈ సందర్భంగా రామాలయం వార్షికోత్సవం కరపత్రాలను వారు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు పంజాల కుమారస్వామి, మదాసి రమేశ్, సారయ్య, మధునయ్య, కుమార్, రాజబాబు, గుజ్జుల రాజిరెడ్డి, నారాయణ, చంద్రయ్య ఉన్నారు.